

## మెరిసిన ఇషా సింగ్

ఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ సెలక్షన్స్ ట్రయల్స్‌లో భాగంగా ఢిల్లీలోని కర్ణిసింగ్ షూటింగ్ రేంజ్‌లో జరుగుతున్న మహిళల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ అర్హత పోటీల తొలిరోజు హైదరాబాదీ షూటర్ ఇషాసింగ్ అగ్రస్థానంలో నిలిచింది. టీ1 క్వాలిఫికేషన్‌లో భాగంగా ఇషా 585 పాయింట్లు స్కోరు చేసి తొలి స్థానం దక్కించుకుంది. 583 పాయింట్లతో సిమ్రన్‌ప్రీత్ కౌర్, భారత అగ్రశ్రేణి షూటర్ మనూ బాకర్ (582) వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. ఈ ట్రయల్స్‌లో పాల్గొంటున్న పది మంది షూటర్లు శనివారం మరోసారి బరిలోకి దిగనున్నారు. ఆ ర్యాంకుల ఆధారంగా ఒలింపిక్స్ బెర్తులు ఖాయమవుతాయి.

## మళ్లీ అగ్రస్థానానికి గుకేశ్

- క్యాండిడేట్స్ చెస్ టోర్నీ

టొరంటో: ప్రతిష్టాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ మళ్లీ అగ్రస్థానానికి చేరుకున్నాడు. శుక్రవారం ముగిసిన ఓపెన్ 12వ రౌండ్‌లో గుకేశ్.. అజర్‌బైజాన్‌కు చెందిన నిజత్ అబసోవ్‌ను ఓడించాడు. దీంతో గుకేశ్.. 7.5 పాయింట్లతో నెపోనియాచి, హికారు నకమురాతో సంయుక్తంగా తొలి స్థానంలో కొనసాగుతున్నాడు. మరోవైపు నెపోనియాచి చేతిలో ప్రజ్ఞానంద.. ఫాబియానో కరునావా చేతిలో విదిత్ ఓటమిపాలవడంతో ఆ ఇద్దరూ టైటిల్ రేసు నుంచి నిష్క్రమించారు. మహిళల విభాగంలో హంపి..గొర్యచెంకాతో గేమ్‌ను డ్రా చేసుకోగా, అన్నా ముజిచుక్‌పై వైశాలి గెలిచింది.

## హార్దిక్‌కు జరిమానా

ముంబై: ఈ సీజన్‌లో మూడో మ్యాచ్ గెలిచిన ముంబై ఇండియన్స్ సారథి హార్దిక్ పాండ్యాకు రూ.12 లక్షల జరిమానా పడింది. గురువారం పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో 'స్లో ఓవర్ రేట్' కారణంగా అతడికి జరిమానా విధిస్తున్నట్టు ఐపీఎల్ పాలకమండలి ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకూ సంజూ శాంసన్, రిషభ్ పంత్, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ జరిమానాలు ఎదుర్కొన్నారు.



రాహుల్ (82)

చెన్నైని చిత్తుచేసిన జెయింట్స్

# లక్నో 'సూపర్'

### రాహుల్, డికాక్ రికార్డు భాగస్వామ్యం • జడేజా, ధోనీ మెరుపులు వృథా

**బౌలర్లకు అనుకూలించే లక్నో పిచ్‌పై కేఎల్ రాహుల్, క్వింటన్ డికాక్ శివాలెత్తడంతో చెన్నై నిర్దేశించిన 177 పరుగుల లక్ష్యం చిన్నబోయింది. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) బ్యాటర్లు క్రీజులో నిలవడానికే తంటాలుపడ్డ పిచ్‌పై ఈ ఇద్దరూ రికార్డు స్థాయిలో తొలి వికెట్‌కు 134 పరుగులు జోడించి లక్నో సూపర్ జెయింట్స్(ఎల్‌ఎస్‌జీ)కు ఈ సీజన్‌లో నాలుగో విజయాన్ని అందించారు. మొదట చెన్నై టాపార్డర్ పనిపట్టి ఆ జట్టును నిలువరించిన లక్నో ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ రెచ్చిపోయి రికార్డు ఛేదనను మరో ఓవర్ ఉండగానే ఛేదించింది. చెన్నైని బ్యాటింగ్‌లో జడేజా, రహానే ఆదుకోగా ఆఖర్లో ధోనీ మెరుపులతో ఆ జట్టు గౌరవప్రదమైన స్కోరు సాధించింది.**

లక్నో: వరుసగా రెండు మ్యాచ్‌లలో ఓటమి తర్వాత లక్నో సూపర్ జెయింట్స్ మళ్లీ విజయాల బాట పట్టింది. బౌలర్లకు అనుకూలంగా ఉంటూ బ్యాటర్లకు కొరకరాని కొయ్యగా మారిన లక్నో పిచ్‌పై రికార్డు ఛేదనను విజయవంతంగా పూర్తి చేసింది. చెన్నై నిర్దేశించిన 177 పరుగులు ఛేదనను మరో ఓవర్ మిగిలుండగానే 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. నిర్జీవమైన లక్నో పిచ్‌పై డికాక్ (43 బంతుల్లో 54, 5 ఫోర్లు, 1 సిక్స్), రాహుల్ (53 బంతుల్లో 82, 9 ఫోర్లు, 3 సిక్సర్లు) రికార్డు భాగస్వామ్యంతో ఆ జట్టు 19 ఓవర్లలోనే లక్ష్యాన్ని పూర్తిచేసింది. తొలుత సీఎస్‌కేను లక్నో బౌలర్లు కట్టడి చేయడంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. రవీంద్ర జడేజా (40 బంతుల్లో 57 నాటౌట్, 5 ఫోర్లు, 1 సిక్సర్), రహానే (36)రాణించారు. రాహుల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

### జడేజా నిలకడ.. ధోనీ మెరుపులు

ఆరంభ మ్యాచ్‌లలో అదరగొట్టిన రచిన్ (0) మరోసారి నిరాశపరచగా కెప్టెన్ రుతురాజ్ (17) విఫలమయ్యాడు. నాలుగో స్థానంలో వచ్చిన జడేజా.. ఓపెనర్ రహానే (36) తో కలిసి వికెట్లను కాపాడుకుంటూనే రన్‌రేట్ పడిపోకుండా పరుగులు రాబట్టారు. మూడో వికెట్‌కు 35 పరుగులు జోడించిన ఈ జోడీని కృనాల్ విడదీశాడు. అతడు వేసిన 9వ ఓవర్లో రహానే క్లీన్‌బౌల్డ్ అవగా ఈ సీజన్‌లో జోరుమీదున్న దూబే (3)ను స్టోయినిస్ పెవిలియన్‌కు పంపాడు. రహానే స్థానంలో వచ్చిన రిజ్వీ (1) ప్రభావం చూపకుండానే చేతులెత్తేయడంతో చెన్నై కష్టాల్లో పడింది. ఈ క్రమంలో జడ్డూ.. మొయిన్ అలీ (30) సీఎస్‌కే బండిని లాగించాడు. 36 బంతుల్లోనే జడ్డూ అర్ధ సెంచరీ పూర్తయింది. 18వ ఓవర్లో హ్యాట్రిక్ సిక్సర్లు కొట్టిన అలీ.. చెన్నై ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చే ప్రయత్నం చేశాడు. కానీ మరుసటి బంతికే అతడు బదోని చేతికి చిక్కాడు. 13 బంతులు మిగిలుండగా క్రీజులోకి వచ్చిన ధోనీ.. 4, 6, 6, 4, 4 తో చెన్నైకి పోరాడే స్కోరును అందించాడు.

### రాహుల్ – డికాక్ రికార్డు భాగస్వామ్యం

లక్ష్య ఛేదనలో లక్నోకు ఓపెనర్లు తిరుగులేని ఆరంభాన్నిచ్చారు. పవర్ ప్లేలో ఈ జోడీ చెన్నై బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చెలాయించి 54 పరుగులు చేసింది. 9వ ఓవర్లో డికాక్ ఇచ్చిన క్యాచ్‌ను షార్ట్ థర్డ్‌మెన్ వద్ద పతిరాన జారవిడవడంతో అతడు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. జడ్డూనే వేసిన 11వ ఓవర్లో బౌండరీతో 31 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. ముస్తాఫిజుర్ 15వ ఓవర్లో డికాక్ ధోనీకి క్యాచ్ ఇవ్వడంతో 134 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఈ పిచ్‌పై ఏ వికెట్‌కు అయినా ఇదే అత్యుత్తమ భాగస్వామ్యం. రాహుల్, డికాక్ ఔట్ అయినా పూరన్ (23 నాటౌట్), స్టోయినిస్ (8 నాటౌట్)గెలుపు లాంఛనాన్ని పూర్తిచేశారు.

### సంక్షిప్త స్కోర్లు

చెన్నై : 20 ఓవర్లలో 176/6 (జడేజా 57 నాటౌట్, రహానే 36, స్టోయినిస్ 1/7, కృనాల్ 2/16). లక్నో : 19 ఓవర్లలో 180/2 (రాహుల్ 82, డికాక్ 54, పతిరాన 1/29, ముస్తాఫిజుర్ 1/43)

### పాయింట్ల పట్టిక

| జ | ఆ | గె | ఓ | ర | పా |
|---|---|---|---|---|---|
| రాజస్థాన్ | 7 | 6 | 1 | 0.67 | 12 |
| కోల్‌కతా | 6 | 4 | 2 | 1.39 | 8 |
| చెన్నై | 7 | 4 | 3 | 0.52 | 8 |
| హైదరాబాద్ | 6 | 4 | 2 | 0.50 | 8 |
| లక్నో | 7 | 4 | 3 | 0.12 | 8 |
| ఢిల్లీ | 7 | 3 | 4 | -0.07 | 6 |
| ముంబై | 7 | 3 | 4 | -0.13 | 6 |
| గుజరాత్ | 7 | 3 | 4 | -1.30 | 6 |
| పంజాబ్ | 7 | 2 | 5 | -0.25 | 4 |
| బెంగళూరు | 7 | 1 | 6 | -1.18 | 2 |

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె:గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

## బ్లాక్‌లో ఐపీఎల్ టికెట్లు

### విక్రయిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల అరెస్ట్

కొండాపూర్, ఏప్రిల్ 19 : క్రికెట్ ప్రేమికుల అభిమానాన్ని ఆసరాగా తీసుకుని బ్లాక్‌లో ఐపీఎల్ మ్యాచ్ టికెట్లు అమ్ముతున ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను సైబరాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్నాపూర్‌కు చెందిన మధుబాబు(30), సైనిక్‌పురి డిఫెన్స్ కాలనీకి చెందిన మాథ్యూ రోడ్రిక్స్(25), కొండాపూర్ అంజయ్యనగర్ వాసి నిజంతన్ ఎలంగోవన్ (26) ముగ్గురు కలిసి ఐపీఎల్ మ్యాచ్ టికెట్లను బ్లాక్‌లో అమ్ముతున్నారు. హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో హైదరాబాద్, బెంగుళూరు మధ్య ఈ నెల 25న జరగబోయే మ్యాచ్ టికెట్లు బ్లాక్‌లో అమ్ముతున్న పక్కా



సమాచారంతో మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 15 టికెట్లు స్వాధీనం చేసుకున్నారు, ఒక్కో టికెట్‌ను రూ.10వేల నుంచి 15వేల చొప్పున విక్రయిస్తున్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పారిస్ ఒలింపిక్స్‌లో 'ఏఐ'





పారిస్: మరి కొద్దిరోజుల్లో మొదలుకాబోయే పారిస్ ఒలింపిక్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)ను వినియోగించనున్నట్టు అంతర్జాతీయ ఒలింపిక్ సమాఖ్య (ఐవోసీ) అధ్యక్షుడు థామస్ బాచ్ తెలిపారు. విశ్వక్రీడల్లో ఏఐని బాధ్యతాయుతంగా వాడుతామని ఆయన అన్నారు. ఒలింపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులు ఆన్‌లైన్‌లో వేధింపులు ఎదుర్కోకుండా అడ్డుకోవడానికి, ఈ క్రీడలను ఇంటినుంచే చూసే వీక్షకులకు ఆ ప్రసారాలను మరింత మెరుగ్గా అందించే క్రమంలో ప్రసారకర్తలకు సాయపడటానికి గాను ఏఐని వాడనున్నట్టు ఆయన చెప్పారు.

ఐపీఎల్ ముచ్చట్లు

# 20వ ఓవర్ మొనగాడు



నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

భారత క్రికెట్‌లో 'ఫినిషర్' అనే చర్చ వస్తే మరో ఆలోచన లేకుండా తక్కున గుర్తొచ్చే పేరు మహేంద్రసింగ్ ధోనీ. 2004 నుంచి 2019 దాకా అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ జార్ఖండ్ డైనమైట్ ఒంటిచేత్తో భారత్‌కు అసాధారణ విజయాలను అందించిన సందర్భాలు కోకొల్లలు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకుని నాలుగేండ్లు గడుస్తున్నా, 42 ఏండ్ల వయసులోనూ ఐపీఎల్ ఆడుతున్నా అతడిలోని ఫినిషర్ మాత్రం బంతిని బాదడంలో ఇంకా 20 ఏండ్ల కుర్రాడి కంటే కసిమీదే కనిపిస్తున్నాడు. 2024 సీజన్‌లో కెప్టెన్సీ నుంచి తప్పుకున్న ధోనీ.. బ్యాటింగ్‌కు వస్తూ ఆడేది తక్కువ బంతులే అయినా జట్టుకు విలువైన పరుగులు అందిస్తున్నాడు. శుక్రవారం లక్నోతో మ్యాచ్‌లో ధోనీ మెరుపులే ఇందుకు తాజా ఉదాహరణ. 18వ ఓవర్లో క్రీజులోకి వచ్చిన మహీ.. 9 బంతుల్లోనే 3 ఫోర్లు, 2 భారీ సిక్సర్లతో 28 పరుగులు రాబట్టి చెన్నైకి భారీ స్కోరు అందించాడు.

20వ ఓవర్లో ఆడుతూ ధోనీకి ఐపీఎల్‌లో మరే ఆటగాడికి లేని రికార్డు ఉంది. ఈ లీగ్ ఆరంభ సీజన్ (2008) నుంచి లక్నో మ్యాచ్ వరకూ 20వ ఓవర్‌లో ధోనీ ఎదుర్కొన్న బంతులు 313 కాగా చేసిన పరుగులు 772. ఈ క్రమంలో అతడి స్ట్రైక్ రేట్ 245గా ఉంది. ఈ విధ్వంసంలో 53 ఫోర్లు, 65 సిక్సర్లూ ఉన్నాయి. అంటే 772లో 602 పరుగులు బౌండరీలు, సిక్సర్ల రూపంలోనే వచ్చాయంటే అతడి బాదుడు ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఐపీఎల్‌లో యాక్టివ్ ప్లేయర్స్‌తో పాటు రేపో మాపో రిటైర్ కాబోయే ఆటగాళ్లలో ఎవరూ ధోనీ రికార్డుకు దరిదాపుల్లో కూడా లేరు. ప్రస్తుత ముంబై బ్యాటింగ్ కోచ్ కీరన్ పొలార్డ్ (405 పరుగులు), చెన్నై ఆల్‌రౌండర్ జడేజా (368) తదుపరి స్థానాల్లో ఉన్నారు. 20వ ఓవర్‌లో ధోనీ చేసిన పరుగులలో 390 సిక్సర్ల (65) రూపంలోనే వచ్చాయి. లాస్ట్ ఓవర్‌లో అత్యధిక సిక్సర్ల రికార్డూ ధోనీదే.

ఈ సీజన్‌లోనూ ధోనీ ఆఖరి ఓవర్లలో మెరుపులు మెరిపిస్తున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 16 బంతుల్లోనే 37 (ఈ మ్యాచ్‌లో ఆఖరి ఓవర్‌లోనే 20 రన్స్ చేశాడు. ధోనీ బాదుడు చూశాక.. 'బ్యాటింగ్ ఆర్డర్‌లో అతడు ఇంకాస్త ముందుకొస్తే బాగుండు' అన్న వాదనలూ వినిపించాయి. ముంబైతో మ్యాచ్‌లో హ్యాట్రిక్ సిక్సర్లతో ధోనీ.. వాంఖడేలో 2011 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చాడు. తాజాగా లక్నోలోనూ అదే సీన్ రిపీట్ చేశాడు. మహేంద్రుడి ఆఖరి సీజన్ (?)గా భావిస్తున్న 2024లో ఆడేది తక్కువ బంతులే అయినా ధోనీ మాత్రం అభిమానులను నిరాశపరచడం లేదు. ఈ సీజన్‌లో ధోనీ ఐదు మ్యాచ్‌లలో బ్యాటింగ్‌కు వచ్చి నాటౌట్‌గా నిలవడం మరో విశేషం. చెన్నై యాజమాన్యం కూడా మరో రెండు ఓవర్లు, పది బంతుల్లో ఇన్నింగ్స్ ముగుస్తుందంటే ధోనీని బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు పంపుతూ పరుగులు దండుకోవడంతో పాటు అతడి ఆటను చూసేందుకు వచ్చిన ఫ్యాన్స్ కోరికనూ తీరుస్తున్నది.

# మూర్తి మనుమడా.. మజాకా

### వయసు 5 నెలలు.. సంపద రూ.244 కోట్లు

### ఇన్ఫోసిస్ బంపర్ డివిడెండ్‌తో పెరిగిన రూ.4.2 కోట్లు



*న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: ఎన్‌ఆర్ నారాయణ మూర్తి.. భారతీయ వ్యాపార రంగంలో, ప్రపంచ ఐటీ ఇండస్ట్రీలో పరిచయం అక్కర్లేని పేరు. ఇప్పుడీయన మనుమడు కూడా అంతే స్థాయిలో పాపులరైపోయాడు. అవును.. ఏకాగ్రహ్ రోహన్ మూర్తి వయసు 5 నెలలు. కానీ సంపద రూ.244 కోట్లపైనే మరి. నారాయణ మూర్తి, సుధా మూర్తిల కుమారుడు రోహన్ మూర్తి, అపర్ణా క్రిష్ణన్ దంపతుల ఏకైక కొడుకే ఈ ఏకాగ్రహ్ మూర్తి. ఏకాగ్రహ్‌కు ఇటీవలే తన తాత, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన నారాయణ మూర్తి.. రూ.240 కోట్ల విలువైన 15 లక్షల కంపెనీ షేర్లను బహుమతిగా ఇచ్చారు. దీంతో దేశీయ రెండో అతిపెద్ద ఐటీ రంగ సంస్థ అయిన ఇన్ఫోసిస్ వాటాదారుల్లో షేర్ల పరంగా అతిపిన్న వయసు కలిగిన మిలియనీర్, విలువపరంగా బాల బిలియనీర్‌గా ఏకాగ్రహ్ చరిత్ర సృష్టించారు. అయితే తాజాగా ఈ బెంగళూరు ఆధారిత ఐటీ రంగ సంస్థ బంపర్ డివిడెండ్‌ను ప్రకటించింది. ఇన్ఫోసిస్ ద్వారా వచ్చిన ఈ తుది, ప్రత్యేక డివిడెండ్లతో ఏకాగ్రహ్ మూర్తికి తన వాటా ప్రకారం రూ.4.2 కోట్లు వస్తున్నాయి. దీంతో ఏకాగ్రహ్ సంపద విలువ రూ.244 కోట్లను దాటేసింది. గత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను ఒక్కో షేర్‌కు ఫైనల్ డివిడెండ్‌గా రూ.20, ప్రత్యేక డివిడెండ్‌గా అదనంగా మరో రూ.8, మొత్తం రూ.28ని ఇన్ఫోసిస్ బోర్డు గురువారం సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. ఈ డివిడెండ్ల చెల్లింపులకు రికార్డ్ తేదీ మే 31. జూలై 1న షేర్‌హోల్డర్లకు ఇన్ఫోసిస్ చెల్లిస్తుంది.*

# బీమా సంస్థలపై గురి

### అమ్మకానికి జీఐసీ, ఎల్ఐసీ వాటాలు

### ఈ ఆర్థిక సంవత్సరం పెట్టుబడుల ఉపసంహరణకు సిద్ధం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: ప్రభుత్వ రంగ బీమా సంస్థలైన జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జీఐసీ), లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ)ల్లో వాటాల ఉపసంహరణకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. జీఐసీ కోసం నిర్వహించిన రోడ్‌షోల్లో మదుపరుల నుంచి మంచి స్పందన రావడంతో ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) పెట్టుబడుల ఉపసంహరణకు ఆర్థిక మంత్రిత్వ శాఖ లైన్ చేసినట్టు సంబంధిత ఓ అధికారి చెప్తున్నారు. ఇందులో భాగంగానే జీఐసీలో దాని షేర్ల విలువ ఆధారంగా 10 శాతం వాటా విక్రయానికి యోచిస్తున్నట్టు ప్రముఖ వార్తా ఏజెన్సీ రాయిటర్స్ శుక్రవారం తెలిపింది. స్టాక్ మార్కెట్‌లో ప్రస్తుత జీఐసీ షేర్ విలువ ప్రకారం ఈ వాటా అమ్మకంతో ఖజానాకు దాదాపు రూ.5,700 కోట్ల ఆదాయం రావచ్చని అంచనా. గడిచిన 6 నెలల్లో జీఐసీ షేర్ల విలువ సుమారు 45 శాతం పెరగడం గమనార్హం.

**ఎల్ఐసీలో..**

ముందుగా నిర్ణయించినట్టుగానే ఎల్ఐసీలో 2029కల్లా 10 శాతం, 2032 నాటికి 25 శాతం వాటాను అమ్మేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తున్నదని సంబంధిత అధికారి ఒకరు తెలియజేశారు. అయితే చిన్నచిన్న విడుతలుగానే ఈ షేర్ల విక్రయానికి ప్లాన్ చేస్తున్నామంటున్నారు. స్టాక్ మార్కెట్‌లో ఈ సంస్థ షేర్ల ప్రదర్శన, మదుపరుల నుంచి వచ్చే స్పందన ఆధారంగా పెట్టుబడుల ఉపసంహరణకు వీలుందని అంటున్నారు. గడిచిన ఆరు నెలల్లో ఎల్ఐసీ షేర్ విలువ 58 శాతం పుంజుకున్నది. శుక్రవారం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లో కంపెనీ షేర్ రూ.972.60 వద్ద ముగిసింది. 2022 మే నెలలో దేశీయ స్టాక్ మార్కెట్లలో ఎల్ఐసీ షేర్లు నమోదైనది విదితమే. ఐపీవో ద్వారా ఎల్ఐసీలో 3.5 శాతం వాటాను కేంద్రం అమ్మేసింది. మరో 1.5 శాతం వాటాను అమ్మాలని మోదీ సర్కారు చూస్తున్నది. ఇదే జరిగితే ప్రస్తుత షేర్ ధర ప్రకారం సుమారు రూ.9,200 కోట్ల ఆదాయం రావచ్చని అంచనా. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత వీటిపై ఓ స్పష్టత రానుందని పేర్కొంటున్నారు.

వాణిజ్య

## ప్రీమియం వసూళ్లలో ఎల్ఐసీ జోరు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) ప్రీమియం వసూళ్లలో దూసుకుపోతున్నది. మార్చి నెలలో మొత్తం ప్రీమియం వసూళ్లు ఏడాది ప్రాతిపదికన 26.41 శాతం ఎగబాకి రూ.36,300.62 కోట్లకు చేరుకున్నాయి. క్రితం ఏడాది ఇది రూ.28,716.23 కోట్లుగా ఉన్నాయి. ఎల్ఐసీ తర్వాత ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రీమియం వసూళ్లు 24.76 శాతం పెరగగా, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ 12.58 శాతం వృద్ధిని కనబరిచాయి. కానీ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రీమియం వసూళ్లు 20 శాతం పడిపోయాయి. 58.87 శాతం మార్కెట్ వాటాతో ఎల్ఐసీ తొలి స్థానంలో నిలిచింది. మరోవైపు, ప్రపంచ భలమైన బీమా బ్రాండ్లలో ఎల్ఐసీ తొలిస్థానంలో నిలిచిన విషయం తెలిసిందే.



## గ్రామీణ బాటపట్టిన హ్యుందాయ్

చెన్నై, ఏప్రిల్ 19: ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్.. గ్రామీణ బాటపట్టింది. గ్రామాల్లో ఉండేవారిని లక్ష్యంగా పెట్టుకొని 'గ్రామీణ్ మహోత్సవ్' పేరుతో దేశవ్యాప్తంగా 16 నూతన ప్రాంతాల్లో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మహోత్సవంలో కంపెనీకి చెందిన మాడళ్లను ప్రదర్శించడంతోపాటు లైవ్ మ్యూజిక్, ఫోక్ డ్యాన్స్‌లు, ప్రాంతీయంగా ఉండే వారిని ప్రోత్సహించే దిశగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఈసారి వర్షాలు సాధారణ స్థాయి కంటే అధికంగా నమోదుకానున్నాయని, దీంతో ఆదాయ వనరులు పెరగనుండటం, మౌలిక సదుపాయాలు మెరుగవడంతో మొత్తం విక్రయాల్లో గ్రామీణ ప్రాంతం వాటా మరింత పెరిగే అవకాశం ఉన్నదన్నారు. మొత్తం అవుట్‌లెట్లలో 40 శాతం స్టోర్లు గ్రామీణ ప్రాంతాల్లోనే నెలకొల్పినట్లు చెప్పారు.

# కోలుకున్న స్టాక్ మార్కెట్లు

### 73 వేల పైకి సెన్సెక్స్

ముంబై, ఏప్రిల్ 19: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. బ్యాంకింగ్, వాహన రంగ షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు తోడవడంతో వరుసగా నాలుగు రోజులు భారీగా పతనమైన సూచీలు ఎట్టకేలకు లాభాల్లోకి మళ్లాయి. వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 599.34 పాయింట్లు ఎగబాకి తిరిగి 73 వేల పాయింట్ల పైన 73,088.33 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 672 పాయింట్లు పెరిగిన విషయం తెలిసిందే. అలాగే మరో సూచీ నిఫ్టీ సైతం 151.15 పాయింట్లు అందుకొని 22,147 వద్ద స్థిరపడింది. మధ్యాహ్నం వరకు నష్టాల్లో ట్రేడైన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో భారీగా పుంజుకున్నాయి.

- బజాజ్ ఫైనాన్స్ 3.38 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- అలాగే మహీంద్రా, మారుతి, జేఎస్ డబ్ల్యూ స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, విప్రో, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐటీసీ, టాటా స్టీల్, టెక్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్‌లు ఒక్క శాతానికి



పైగా బలపడ్డాయి.

- ఎస్బీఐ, హెచ్‌యూఎల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, కొటక్ బ్యాంక్, సన్‌ఫార్మాలు కూడా పెరిగాయి.
- హెచ్‌సీఎల్ టెక్, నెస్లెలు ఒక్క శాతానికి పైగా నష్టపోయాయి.
- వీటితోపాటు ఎల్‌అండ్‌టీ, టాటా మోటర్స్, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీలు పతనం చెందాయి.
- రంగాలవారీగా చూస్తే బ్యాంకింగ్, మెటల్, ఆర్థిక సేవలు, కన్స్యూమర్ డ్యూరబుల్, కమోడిటీ రంగ షేర్లు లాభాల్లో ముగియగా..ఐటీ, టెలికం, యుటిలిటీ, రియల్టీ, టెక్ రంగ షేర్లు నష్టపోయాయి.
- ఈ వారంలో సెన్సెక్స్ 1,156,57 పాయింట్లు(1.55 శాతం), నిఫ్టీ 372.40 పాయింట్లు(1.65 శాతం) చొప్పున పతనం చెందాయి.

## మళ్లీ 74 వేలకు బంగారం ధర

*రోజు రోజుకు సామాన్యుడికి అందనంత స్థాయికి చేరుకుంటున్నది బంగారం. శుక్రవారం బంగారం ధర మరో రికార్డు స్థాయి రూ.74 వేల మార్క్‌ను అధిగమించింది. ఈ రికార్డుకు చేరుకోవడం ఇదే తొలిసారి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర మరో రూ.400 అందుకొని రూ.74,100కి చేరుకున్నది. పసిడితోపాటు వెండి రూ.100 అందుకొని రూ.86,600 పలికింది. ఇటు హైదరాబాద్‌లో రూ.540 పెరిగిన 24 క్యారెట్ పుత్తడి ధర రూ.73,800 నుంచి రూ.74,340కి చేరుకున్నది. అలాగే 22 క్యారెట్ ధర రూ.500 అందుకొని రూ.68,150 పలికింది. వెండి మాత్రం రూ.90 వేల వద్ద స్థిరంగా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,390 డాలర్లకు చేరుకున్నది.*

## ఫారెక్స్ నిల్వలు డౌన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: విదేశీ మారకం నిల్వలు క్షీణించాయి. ఈ నెల 12తో ముగిసిన గత వారంలో 5.4 బిలియన్ డాలర్లు పతనమయ్యాయి. అంతకు ముందు వారం వరకు వరుసగా 7 వారాలపాటు పెరుగుతూపోయిన ఫారెక్స్ రిజర్వులు.. మునుపెన్నడూ లేనివిధంగా ఆల్‌టైమ్ హైని తాకిన విషయం తెలిసిందే. తొలిసారి ఈ నెల 5న 648.562 బిలియన్ డాలర్లకు చేరినట్టు ఆర్బీఐ తెలిపింది. తాజాగా 5.401 బిలియన్ డాలర్లు పడిపోయి 643.162 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.

## 'రెరా జరిమానా వసూళ్లకు ప్రత్యేక వ్యవస్థ'

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ):వివిధ సంస్థలకు విధించిన అపరాద రుసుమును వసూలు చేయడానికి సొంతంగా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని రెరా చైర్మన్ సత్యనారాయణకు తెలంగాణ వినియోగదారుల ఫోరం సూచించింది. ఇందుకు సంబంధించి రెరా కార్యాలయంలో వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు ప్రమోద్ కుమార్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌లు వినతి పత్రాన్ని అందించారు.

# ఐటీ కంపెనీల్లో ఉద్యోగులు ఔట్

### గత ఆర్థిక సంవత్సరం టాప్ సంస్థల్లో 64వేల మంది బయటకు

బెంగళూరు, ఏప్రిల్ 19: దేశీయ టాప్ ఐటీ రంగ సంస్థల్లో ఉద్యోగులు తగ్గుతున్నారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24) టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్, విప్రోల నుంచి 64,000 మంది ఉద్యోగులు బయటకుపోయారు. కాగా, అంతర్జాతీయ మార్కెట్‌లో ఐటీ సర్వీసులకు డిమాండ్ లేకపోవడం, కస్టమర్లు వ్యయ నియంత్రణ మంత్రం జపిస్తున్న నేపథ్యంలో ప్రధాన ఐటీ కంపెనీల్లో హెడ్‌కౌంట్ పడిపోవడం గమనార్హం. భారతీయ ఐటీ కంపెనీలకు గ్లోబల్ మార్కెటే కీలక ఆదాయ వనరుగా ఉన్న విషయం తెలిసిందే.

- ఈ జనవరి-మార్చి త్రైమాసికానికిగాను విప్రో ప్రకటించిన తాజా ఆర్థిక ఫలితాల్లో ఈ ఏడాది మార్చి ఆఖరు నాటికి సంస్థ ఉద్యోగులు 2,34,054గా ఉన్నారు.



ఏడాది క్రిందట 2,58,570 మంది ఉండగా, 24,516 మంది తగ్గారు.

- అలాగే దేశీయ రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్‌లో 3,43,234 నుంచి 3,17,240కి పడిపోయారు. ఏడాది వ్యవధిలో 25,994 మంది దిగారు.
- దేశీయ ఐటీ రంగ దిగ్గజ సంస్థ టీసీఎస్‌లో ఈ మార్చి 31 నాటికి 6,01,546 మంది ఉద్యోగులున్నారు. గత ఏడాది మార్చి ఆఖరుతో పోల్చితే 13,249 మంది తగ్గిపోయారు.

## విప్రో లాభం నిరాశాజనకం

బెంగళూరు, ఏప్రిల్ 19: ఐటీ సేవల సంస్థ విప్రో నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన త్రైమాసికానికిగాను సంస్థ రూ.2,834.6 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. 2022-23 ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.3,074.5 కోట్లతో పోలిస్తే 7.8 శాతం తగ్గినట్లు పేర్కొంది. గత త్రైమాసికానికిగాను సంస్థ రూ.22,208.3 కోట్ల ఆదాయాన్ని గడించింది. క్రితం ఏడాది వచ్చిన రూ.ఆదాయంతో పోలిస్తే 4.2 శాతం తగ్గింది.

- 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.89,760.3 కోట్ల ఆదాయంపై రూ.11,045 కోట్ల లాభాన్ని గడించింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.